
## మహాత్ముడికి ఘన నివాళి


బాన్సువాడలో నివాళులు అర్పిస్తున్న సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి


వేల్పూర్‌లో నివాళులు అర్పిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ఉమ్మడి జిల్లాలో సోమవారం భారత జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల సభ్యులు గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బాన్సువాడలో సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి, వేల్పూర్ మండల కేంద్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే జాజాల సురేందర్, పెద్దకొడప్‌గల్‌లో ఎమ్మెల్యే హన్మంత్ షిండే.. గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.


ఎల్లారెడ్డిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్


పెద్ద కొడప్‌గల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

# కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దు

- తెలంగాణ జాతిపిత సీఎం కేసీఆర్
- మోదీ మాటలను నమ్మే పరిస్థితుల్లో జిల్లా ప్రజలు లేరు
- కోట్లతో నిర్మించిన రోడ్లను కాపాడుకునే బాధ్యత ప్రజలదే
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ఇందల్వాయి, అక్టోబర్ 2: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తిర్మన్‌పల్లి, అన్సాన్‌పల్లి, వెంగళ్‌పాడ్, ఎల్లారెడ్డిపల్లి, గన్నారం, నల్లవెల్లి గ్రామాల్లో రూ.21 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో బాజిరెడ్డి మాట్లాడుతూ.. దేశం కోసం పోరాడిన వ్యక్తి మహాత్మా గాంధీ అని, తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని అన్నారు. రూ.10 కోట్ల నిధులతో ఇందల్వాయి నుంచి ధర్పల్లి వయా సిరికొండ మండలాలకు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.దీనికి బీజేపీ నాయకులు గతంలో మట్టి పోసి రాజకీయాలు చేశారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకుల తీరు.. అమ్మకు అన్నం పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు చేయిస్తాడట అన్న చందంగా మారిందన్నారు. స్వరాష్ట్రంలో గ్రామాల్లోని చెరువులు, కుంటలకు రూ.కోట్లతో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలకూ న్యాయం చేస్తున్నదని తెలిపారు. తెలంగాణ వ్యతిరేకి మోదీ అని విమర్శించారు. కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలుచేయడంలేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధి చేసే వారెవరో.. మాటలు చెప్పే వారెవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కోట్ల రూపాయలతో గ్రామాల్లో రోడ్లను నిర్మిస్తున్నామని, వాటిని కాపాడుకునే బాధ్యత ప్రజలదే అని స్పష్టం చేశారు.

# బీఆర్‌ఎస్‌లోకి జోరుగా వలసలు

**రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి సమక్షంలో చేరికలు**

సిరికొండ, అక్టోబర్ 2 : ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌లోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గులాబీ పార్టీలో చేరుతున్నారు. తాజాగా మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన 21 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ జిల్లా మాజీ ఆర్గనైజర్ డాక్టర్ కెఎన్.చారి, బీజేపీ గ్రామశాఖ సభ్యులు మామిడి మోహన్, కొండ స్వామి, కొండ అన్వేశ్, కొండ రాహుల్, మామిడి ప్రశాంత్ ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేశ్, సొసైటీ వైస్ చైర్మన్ అబ్బాస్, ఉప సర్పంచ్ సుమన్, వార్డు మెంబర్ రవి, కొండాపూర్ యూత్ ప్రెసిడెంట్ నర్సయ్య, సిరికొండ మండల మాజీ జాగృతి అధ్యక్షుడు జగన్, సంతోష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

# అభివృద్ధి చేశా.. మరోసారి ఆశీర్వదించండి..

- నియోజకవర్గంలో అన్ని పనులు పూర్తిచేస్తున్నాం..
- డోంగ్లిని మండలంగా ఏర్పాటు చేసుకున్నాం
- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- మద్నూర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

మద్నూర్, అక్టోబర్ 2: జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, తనను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే హన్మంత్ షిండే కోరారు. మండలకేంద్రంలో సోమవారం మద్నూర్, డోంగ్లి మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.అంతకుముందు మండలంలోని పెద్ద ఎక్లారా గేటు నుంచి వందల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండల కేంద్రానికి ఇటీవల డిగ్రీ కళాశాల, సెంట్రల్ లైటింగ్ మంజూరుచేసినట్లు తెలిపారు. గతేడాది డోంగ్లిని నూతన మండలంగా ఏర్పాటు చేయడంతో అక్కడి ప్రాంతవాసులకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అడిగింది కాదనకుండా తమకు సీఎం కేసీఆర్ నిధులను విడుదల చేస్తున్నారని, ఆయనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సలాబత్‌పూర్ ఆలయానికి రూ. 7 కోట్ల నిధులు మంజూరుకావడంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సెంట్రల్ లైటింగ్ కోసం మరిన్ని నిధులు తీసుకువస్తామన్నారు. సుమారు 12వేల మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా లబ్ధి జరిగినట్లు తెలిపారు. త్వరలో దళితులందరికీ దళితబంధు పథకం వర్తింపజేస్తామన్నారు. ఓపిక పట్టాలని, అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. పేద విద్యార్థుల కోసం కార్పొరేట్ తరహాలో గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో పార్టీ మండలాల అధ్యక్షులు బస్సీపటేల్, శశాంక్‌పటేల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దరాస్ సురేశ్, గఫార్, సొసైటీ చైర్మన్ శ్రీనూ పటేల్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, విండో మాజీ చైర్మన్లు విజయ్‌కుమార్, పండిత్‌రావుపటేల్, సీనియర్ నాయకులు బస్వరాజ్‌పటేల్, బాబూపటేల్, శంకర్‌పటేల్, శివకుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లు డబుల్ హ్యాపీ

- కమీషన్ పెంచుతూ జీవో జారీ చేసిన ప్రభుత్వం
- కామారెడ్డిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు

కామారెడ్డి, అక్టోబర్ 2 : రేషన్ డీలర్లకు ప్రభుత్వం రెండింతలు కమీషన్ పెంచుతూ జీవో జారీ చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద రేషన్ డీలర్లు సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్వింటాలుకు గతంలో రూ.70 ఉండగా..ఏకంగా రెండింతలు పెంచుతూ రూ.140 ప్రకటించిందని తెలిపారు. తాము అడగగానే కమీషన్ పెంచిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లద్దూరి లక్ష్మీపతియాదవ్, పరిగి జనార్దన్ రెడ్డి, ప్రభాకర్, మల్లారెడ్డి, అశోక్ జైన్, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రం, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.